

చివరి ఆయకట్టుకు..
నిజాంసాగర్ చివరి ఆయకట్టుకూ నీరందేలా చూస్తామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.
- 10లో ▸



అమలు చేస్తాం
ఈనెలాఖరులోగా రైతుబంధు నిధులు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /15.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్: కేంద్ర మత్స్య, పశు సంవర్ధకశాఖల మంత్రి పరుషోత్తం రూపాలాను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి బుధవారం ఢిల్లీలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయమై చర్చించి, నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి బద్దం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'కరోనాపై అవగాహన కల్పించండి'



భిక్కనూరు: కోవిడ్ మళ్లీ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ సూచించారు. బుధవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కోవిడ్ పరీక్ష కిట్స్, ఆక్సిజన్ సిలండర్‌లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి కోవిడ్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు ఆదర్శ్, యోమిమా, ఫార్మసిస్ట్ వెంకటేశం, ల్యాబ్ టెక్నిషియన్ సతీష్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని మైనారిటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, బిచ్కుంద, లింగంపేట, ఎల్లారెడ్డిలలోని మైనారిటీ విద్యాసంస్థల్లో 5, 6, 7, 8 తరగతులతోపాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు వచ్చేనెల ఆరో తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 99122 44005, 040-23437909 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

లడ్డూకు ఘన స్వాగతం



భిక్కనూరు: సికింద్రాబాద్‌కు చెందిన శ్రీరామ క్యాటరింగ్ ట్రస్ట్ తయారు చేసిన 1,256 కిలోల భారీ లడ్డూకు బుధవారం రాత్రి జిల్లా సరిహద్దుల్లోని బస్వాపూర్‌లో రామభక్తులు ఘన స్వాగతం పలికారు. లడ్డూను సికింద్రాబాద్‌నుంచి అయోధ్యకు తరలిస్తున్నారు. భిక్కనూరుతోపాటు బస్వాపూర్, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, శ్రీసిద్ధరామేశ్వరనగర్, పెద్దమల్లారెడ్డి, గుర్జకుంట గ్రామాలలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

బైకుపై అయోధ్యకు..

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని లక్కంపల్లి, షాపూర్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు బుధవారం బైకుపై అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. షాపూర్‌లోని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి బయలుదేరారు. రామ మందిరం ప్రారంభోత్సవంతో పాటు ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో లక్కంపల్లికి చెందిన గోపరి సాయిలు, గోపరి భూమన్న, సిరిపురం రవి, గంగాధర్, షాపూర్‌కు చెందిన కొండాపూర్ లక్ష్మణ్, సర్దార్ నాగేశ్‌లు ఉన్నారు. యాత్రను బీజేపీ రాష్ట్ర నాయకులు బద్దం లింగారెడ్డి, అరుట్ల రమేశ్, పుల్లూరు గంగాధర్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.



మూత'బడి'.. తెరుచుకునేనా?

- జిల్లాలో పదేళ్లలో 46 పాఠశాలల మూసివేత
- మారుమూల పల్లెలకు 'దూర'మైన విద్య
- అన్ని ఊళ్లలో పాఠశాలలు ఉండాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- సౌకర్యాలు కల్పిస్తేనే సర్కారు బడికి భవిత

"ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలి. అందుకు తగిన ప్రణాళిక రూపొందించండి" అని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. దీంతో మూతబడిన పాఠశాలల అంశం చర్చకు వస్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న సాకుతో మూసి వేసిన బడులను తెరిపించాలని విద్యాభిమానులు కోరుతున్నారు.

సాక్షి, కామారెడ్డి: సర్కారు బడులను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అలాగే చాలాచోట్ల కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో విద్య కుంటుపడుతోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన విద్య అందడం లేదు. మరోవైపు తమ పిల్లలకు మంచి విద్య అందాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు అప్పులు చేసైనా సరే ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి మూతబడుతున్నాయి.

ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు ఉంటే తల్లిదండ్రులు తమ పిల్లలను అందుబాటులో ఉండే బడికే పంపించడానికి ఆసక్తి చూపిస్తారు. కానీ చాలాచోట్ల ఏకోపాధ్యాయులు ఉన్న పరిస్థితుల్లో టీచర్ సెలవు పెట్టినా, మీటింగ్‌లకు వెళ్లినా ఆ పూట బడికి సెలవే.. దీనికి తోడు కనీసం చాక్‌పీస్‌లు కూడా సరఫరా చేయడం లేదు. తాగునీటి సౌకర్యం లేకపోవడం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోంచి ప్రైవేట్ స్కూళ్లకు మారుస్తున్నారు. ఫలితంగా సర్కారు పాఠశాలలు మూతబడుతున్నాయి.

ఇప్పటికే 46 స్కూళ్ల మూత..

విద్యాశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 698 ప్రాథమిక పాఠశాలలు, 126 ప్రాథమికోన్నత పాఠశాలలు, 189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఏడాదికి కొన్ని స్కూళ్లు మూతబడుతున్నాయి. జిల్లాలో పదేళ్లలో 46 స్కూళ్లు మూతబడ్డాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలే 45 ఉన్నాయి. ఒక్కటి మాత్రం ప్రాథమికోన్నత పాఠశాల.. భిక్కనూరు మండలంలోని మొటాట్‌పల్లి, గాంధారి మండలంలోని దుర్గం, పల్లెమడుగు తండా పాఠశాలలు మూతబడ్డాయి. బిచ్కుంద మండలంలోని మెక్కా, మెట్టుతండా, సదాశివనగర్ మండలం దగ్గి బడి, రామారెడ్డి మండలం రాజమ్మతండా, మాచారెడ్డి మండలం అంతంపల్లి, చెరువు కొమ్ముతండా, మాచారెడ్డి మండల కేంద్రంలోని ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాల, నిజాంసాగర్ మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి, అచ్చంపేట ఉర్దూ మీడియం, నల్లగుట్టతండా, మర్పల్లి, డోంగ్లీ మండలంలోని లచ్మాపూర్, నస్రుల్లాబాద్ మండలంలోని ఫకీరానాయక్ తండా, కట్టకిందితండా, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్, ఆత్మకూర్‌లోని ఉర్దూమీడియం, పెద్దకొడప్‌గల్ మండలంలో కాటేపల్లి ఉర్దూ మీడియం, మాన్సింగ్ తండా, చిన్నదేవిసింగ్ తండా, లచ్చిరాంతండా, తుప్దల్, బాన్సువాడ మండలం బోర్లం, కొత్తబాది గ్రామాల్లోని ఉర్దూ మీడియం పాఠశాల మూతబడ్డాయి. మూతబడినవాటిలో చాలా పాఠశాలలు మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లోనే ఉన్నాయి. విద్యార్థులు లేరన్న సాకుతో వాటిని మూసివేశారు. మరోవైపు ఇప్పటికీ బడి ఎరుగని పల్లెలూ ఉండడం గమనార్హం. నాగిరెడ్డిపేట మండలంలోని బెజుగం చెరువు తండాతోపాటు ఎల్లారెడ్డి మండలంలోని దావల్‌మల్కపల్లి, జుక్కల్ మండలంలోని మధుర తండాలలో ఇప్పటివరకు సర్కారు బడి లేదు.

డిప్యుటేషన్‌కు ససేమిరా?

జిల్లాలో చాలా స్కూళ్లలో టీచర్లు ఉన్నచోట విద్యార్థులు లేరు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న చోట ఉపాధ్యాయుల కొరత ఉంది. అయితే విద్యార్థులు లేని స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులను సమీప గ్రామాల్లోని స్కూళ్లకు డిప్యుటేషన్‌పై వెళ్లాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చినా కొందరు టీచర్లు ససేమిరా అంటున్నారు. విద్యార్థులు లేకున్నా అక్కడే పొద్దు గడుపుతున్నారు తప్ప డిప్యుటేషన్‌పై వెళ్లడానికి అంగీకరించడం లేదు.

పూర్వవైభవం వచ్చేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోవడం మూలంగానే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు చూస్తున్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాలైన తాగునీరు, టాయ్‌లెట్స్ కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే వాటి నిర్వహణకు నిధుల తోపాటు సిబ్బందిని నియమించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు సరిపడా ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమిస్తే పూర్వ వైభవం వచ్చే అవకాశాలున్నాయి.

సీఎంఆర్‌లో కుంటి సాకులు చెప్పొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- లక్ష్యం చేరుకోకపోతే చర్యలు తప్పవు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) విషయంలో కుంటిసాకులు చెప్పకుండా పది రోజుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్ల అలసత్వం కారణంగా మనం ప్రస్తుతం రాష్ట్రంలో ఎంతగానో వెనుకబడి ఉన్నామని పేర్కొన్నారు. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉందన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 39 రైస్ మిల్లర్లు లక్ష్య సాధనలో చాలా వెనకబడి ఉన్నారన్నారు. పది రోజులపాటు మిల్లులను 24 గంటలు నడిపించైనా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో గడువు పొడిగింపు ఉండదన్నారు. లక్ష్యాన్ని అధిగమించని మిల్లర్లకు 125 శాతం పెనాల్టీ విధించడంతోపాటు వచ్చే సీజనులో ధాన్యం కేటాయించబోమన్నారు. జిల్లాలో రోజు 4,221 మెట్రిక్ టన్నుల ధాన్యం మరాడించడానికి అవకాశం ఉందన్నారు. నాలుగు రోజుల తర్వాత మరోసారి సమీక్షిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల లింగం పాల్గొన్నారు.

నాణ్యమైన పాలను సేకరించాలి

తాడ్వాయి: పాడి రైతుల నుంచి నాణ్యమైన పాలను సేకరించాలని విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మి సూచించారు. ఆమె బుధవారం కలెక్టర్‌తో కలిసి ఎర్రాపహడ్ పాలశీతలీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీపై గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్‌ను అందిస్తోందన్నారు. విజయ డెయిరీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాల కేంద్రాలలో పాలు పోసే రైతులకు మాత్రమే వివిధ బ్యాంకులలో రుణాలతోపాటు పలు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు కరడ్‌పల్లిలోని పాలకేంద్రాన్ని తనిఖీ చేశారు.



బీఎంసీని పరిశీలిస్తున్న విజయ డెయిరీ ఎండీ లక్ష్మి, కలెక్టర్ పాటిల్

'త్వరలో పర్యాటక కేంద్రంగా నాగన్నగారి బావి'



నాగన్నగారి బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లింగంపేట: మండల కేంద్ర సమీపంలోని చారిత్రక కట్టడమైన నాగన్నగారి మెట్ల బావి త్వరలో పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన లింగంపేటలోని నాగన్నగారి బావిని సందర్శించారు. అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. సరిహద్దులు ఏర్పాటు చేసి పురావస్తు శాఖ సూచనల ప్రకారం పునరుద్ధరించాలని ఆదేశించారు. బావి లోపలి భాగం పునరుద్ధరణ పనులు పూర్తికావచ్చాయన్నారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీవో ప్రభాకరచారి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఆర్‌ఐలు బాలయ్య, మోహిద్ తదితరులు ఉన్నారు.

షబ్బీర్ అలీకి నిరాశ!

- దక్కని ఎమ్మెల్సీ అవకాశం
- వరుస ఓటములే కారణమా?
- మాజీ మంత్రి అనుచరుల్లో నిర్వేదం



సాక్షి, కామారెడ్డి: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్‌అలీకి నిరాశే ఎదురైంది. ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన రెండు స్థానాల్లో ఒకటి షబ్బీర్‌కు దక్కుతుందని ఆయన అనుచరులు భావించారు. అదే నమ్మకంతో ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారంటూ ప్రచారం చేసుకున్నారు. అయితే బుధవారం కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించిన జాబితాలో షబ్బీర్ అలీ పేరు లేకపోవడం ఆయన అనుచరులను నిరాశకు గురిచేసింది.

నాలుగు దశాబ్దాలుగా..

కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన షబ్బీర్ అలీ నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తొలుత 1989 లో ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి పదవి దక్కించుకున్నారు. ఆ తర్వాత 1994, 1999 ఎన్నికల్లో ఓడిపోయారు. 2004 ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి దివంగత నేత వైఎస్సార్ మంత్రి వర్గంలో క్యాబినెట్ మంత్రిగా ఐదేళ్లపాటు పనిచేశారు. 2009 ఎన్నికల్లో రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి వైఎస్సార్ రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో షబ్బీర్ అలీ ఓడిపోవడంతో కొంత నిరాశ చెందారు. కొంత కాలానికే శాసన మండలి సభ్యుడిగా నియమితుడై ఆరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారు. కొంతకాలం మండలిలో విపక్ష నేతగానూ పనిచేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2014, 2018 ఎన్నికల్లోనూ ఆయనకు ఓటమి తప్పలేదు. 2023 ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని కామారెడ్డి నియోజక వర్గం అంతా కలియతిరుగుతూ నిత్యం జనం మధ్యలోనే ఉన్నారు.

కామారెడ్డినుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందాలని ఎన్నో కలలు కన్న షబ్బీర్‌అలీ.. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రేవంత్‌రెడ్డికోసం త్యాగం చేయాల్సి వచ్చింది. కామారెడ్డినుంచి అప్పటి సీఎం కేసీఆర్ కామారెడ్డినుంచి బరిలో ఉంటానని ప్రకటించడంతో ఆయనపై పోటీకి రేవంత్‌రెడ్డి సై అన్నారు. దీంతో అధిష్టానం సూచనల మేరకు షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేశారు. అక్కడ మైనారిటీ ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో గెలుపు సునాయాసమని భావించినా.. బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి తప్పలేదు. ఆ ఎన్నికలలో గెలిచి ఉంటే మంత్రి వర్గంలో చోటు లభించేదన్న అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తమైంది. అయితే అసెంబ్లీ ఎన్నికలలో ఓడినా రాష్ట్ర కాంగ్రెస్‌లో మైనారిటీ నేతగా గుర్తింపు ఉండడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన షబ్బీర్‌కు హైకమాండ్ ఎమ్మెల్సీ ఇస్తుందని భావించారు. దశాబ్దాలుగా పార్టీని పట్టుకుని కష్టపడుతున్న తమ నాయకుడిని పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్న నమ్మకంతో ఆయన అనుచరులున్నారు. ఎమ్మెల్యేల కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వారిలో ఆశలు చిగురించాయి. అయితే బుధవారం ప్రకటించిన జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో నిరాశ చెందారు. వరుస ఓటములే షబ్బీర్‌కు ఆటంకంగా మారాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న వారి పదవీ కాలం ముగియడమో లేదా రాజీనామా చేస్తేనో అవకాశాలు వస్తాయి. అయితే కాంగ్రెస్‌లో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో షబ్బీర్ అలీ రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న చర్చ సాగుతోంది.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ

- ఇప్పటికే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రియాశీలక పాత్ర
- నాలుగు దశాబ్దాల సేవలకు ఫలితం
- పార్లమెంట్ ఎన్నికల తరువాత పీసీసీ పీఠం సైతం అప్పగించే అవకాశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నాలుగు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవిని అధిష్టానం కేటాయించింది. ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ కోసం నిరంతరం పాటుపడుతూ వచ్చారు. అనేక పార్టీ పదవులు నిర్వహిస్తూ వచ్చిన మహేశ్‌గౌడ్ ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల విషయమై అనేక ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య చివరి నిముషంలో ఖరారు కావడంతో జిల్లా పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ రెండు స్థానాలకు సంబంధించి బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ పేర్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురయ్యారు. అయితే చివరి నిముషంలో అద్దంకి దయాకర్ స్థానంలో మహేశ్‌కుమార్ గౌడ్ పేరును అధిష్టానం ప్రకటించడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శక్తివంచన లేకుండా కృషిచేసిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్లమెంట్ ఎన్నికల తరువాత పీసీసీ అధ్యక్ష బాధ్యతలు సైతం అప్పగించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు తెలుస్తోంది. సుదర్శన్‌రెడ్డి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖరారైనట్లు తెలుస్తోంది. రెండో విడతలో తప్పకుండా ఇస్తారని శ్రేణులు భావిస్తున్నాయి. అయితే మంత్రివర్గ విస్తరణ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉంటుందా, ఎన్నికల తరువాత ఉంటుందా అనే విషయమై ఉత్కంఠ నెలకొంది.

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా..

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఉత్తర తెలంగాణ నుంచి, మరోవైపు బీసీ కావడంతో పీసీసీ అధ్యక్ష పదవి బాధ్యతలు సైతం అధిష్టానం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్‌గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు ఆశించారు. అయితే ఈ స్థానంలో మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టిన నేపథ్యంలో అధినాయకత్వం సూచన మేరకు టికెట్టును షబ్బీర్ అలీ కోసం త్యాగం చేశారు. పైగా పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలోనే పార్టీ అధినాయకత్వం మహేశ్ కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు పీసీసీ పీఠం అప్పగించనున్నట్లు తెలుస్తోంది. నలభై సంవత్సరాలు గా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీ సీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీ దక్కడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి

తాడ్వాయి: మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో పంటలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కుసుమ పంటలో కాండం తొలుచు ఈగ, ఆలస్యంగా విత్తిన పంటలో పెనుబంక ఉధృతంగా ఉందన్నారు. తెగుల నివారణకు ఎకరానికి అసెటామాప్రిడ్ 0.2గ్రాములు, 0.3మిల్లీలీటర్ల మిడీక్లోప్రిడ్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు. వరిలో ఉల్లికోడ్ ఆశించే అవకాశం ఉందని నివారణకు పిప్రోనిల్ 0.3శాతం ఎసీజీ ఎకరానికి 10కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. ఏవో శ్రీకాంత్, ఏఈవో రాజశేఖర్, రైతులు వెంకట్‌రావు, గంగారెడ్డి పాల్గొన్నారు.



లిఫ్ట్‌లో ఇరుక్కున్న సెక్యూరిటీ గార్డు

- గంటన్నర పాటు నరకయాతన
- నిజామాబాద్‌లోని కోటగల్లీలో ఘటన

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని కోటగల్లీలో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సెక్యూరిటీ గార్డు బుధవారం లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి గంటన్నర పాటు నరకయాతన పడ్డాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. సెక్యూరిటీ గార్డు మహేందర్‌గౌడ్ లిఫ్ట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో కాళ్లు బయట, బాడీ లోపల ఇరుక్కుపోయింది. మహేందర్ కేకలు వేయడంతో స్థానికులు గమనించి వెంటనే ఫైర్ రెస్క్యూ బృందానికి సమాచారం ఇచ్చారు. నిజామాబాద్ ఫైర్‌స్టేషన్‌కు చెందిన రెస్క్యూ బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అరగంట పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ సెక్యూరిటీ గార్డును 108లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కొన్ని రోజులుగా లిఫ్ట్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.



క్లుప్తంగా

జాతీయస్థాయి నెట్‌బాల్‌లో ప్రతిభ


రఘురామ్

కామారెడ్డి అర్బన్: గాంధారి మండలం గండివేట్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రఘురామ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపాడు. ఈ నెల 13 నుంచి 16 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర జట్టులో గోల్ కీపర్‌గా వ్యవహరించిన రఘురామ్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రఘురామ్‌ను టీజీ పేటా అధ్యక్ష, కార్యదర్శులు హీరాలాల్, స్వామిగౌడ్, ప్రతినిధులు సంగి మోహన్, సాయిమౌర్య, టాగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి అభినందించారు.

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



కామారెడ్డి క్రైం: సత్ప్రవర్తన అలవర్చుకోవాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి రౌడీషీటర్‌లకు సూచించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం పట్టణానికి చెందిన రౌడీషీటర్లతో సమావేశమయ్యారు. గతంలో మాదిరిగా ఉండకుంటా ప్రవర్తన మార్చుకోవాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గజ్జు పటేల్ సస్పెండ్

బిచ్కుంద(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు గజ్జు పటేల్‌ను ఆ పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. రాష్ట్ర నాయకుల సూచనలు పాటించకుండా పార్టీకి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించడంతో విచారణ చేపట్టిన అధిష్టానం పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి సురభీ ద్వివేది చేసిన ఉత్తర్వుల మేరకు పటేల్‌ను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మద్నూర్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఆర్టీవో అధికారులు సూచించారు. మండల కేంద్రంలో పాత బస్టాండ్‌లో బుధవారం వాహనదారులకు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రనాయక్ తెలిపారు.

సీసీ రోడ్డు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు



దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్‌లో బుధవారం సీసీ రోడ్డును ట్రాక్టర్‌తో ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. ఇంటిముందు ఉన్న సీసీరోడ్డును గ్రామానికి చెందిన సడుగు నాగరాజు తన సొంత ట్రాక్టర్‌తో ధ్వంసం చేయగా, కార్యదర్శి రాహుల్‌గౌడ్ ఫిర్యాదు చేశారన్నారు.

రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తాం

- ఈ నెలాఖరు లోగా రైతుల ఖాతాల్లో 'రైతు బంధు'
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆంధ్రానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి


సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నందిపేట్(ఆర్మూర్): ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతు డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఆంధ్రానగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన దివంగత నందమూరి తారకరామారావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ఆశీస్సులతోనే రాజకీయాల్లోకి వచ్చిన తామంతా, ఆ మహానుభావుని ఆశయాలకు అనుగుణంగా అదే నిబద్ధతతో, నిజాయితీగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులు కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నా రైతాంగ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. ఇప్పటికే రెండెకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన 29 లక్షల మంది రైతులకు రైతు బంధు అందించామని, మిగతా రైతులకు రేపటి నుంచి వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు లోగా రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులు పడతాయని స్పష్టం చేశారు.

ఆర్మూర్ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకరించి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కోరారు. తాను చిన్ననాటి నుంచి ఎన్టీఆర్ అభిమానిని అని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, జాయింట్ కలెక్టర్ యాదిరెడ్డి, వినయ్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నాయుడు రామారావు, ఎంపీటీసీ గింజుపల్లి రాధాశీను, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు


దామరంచ శివారులో కాలువను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి


విజేతగా నిలిచిన హన్మాజీపేట్ జట్టుకు కప్ అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

బాన్సువాడ: నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బీర్కూర్ మండలంలోని దామరంచ, రైతునగర్, బైరాపూర్, బీర్కూర్ తండా శివారులో ఉన్న నిజాంసాగర్ 25, 26 డిస్ట్రిబ్యూటర్ కాలువలను బుధవారం ఆయన పరిశీలించారు. చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కాలువల మరమ్మతుల కోసం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. 26/4 డిస్ట్రిబ్యూటర్ కాలువ నిర్మించే స్థలాన్ని పరిశీలించి కాలువ పనుల అనుమతుల కోసం సంబంధిత మంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఈ కాలువ పూర్తయితే సుమారు 4 వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. నాయకులు బోయిని శంకర్, కాశీరాం, నందు, సానేపు గంగారాం, యామ రాములు, కమలాకర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి ఉన్నారు.

క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి

బాన్సువాడ రూరల్: బాన్సువాడలో క్రికెట్ మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని హన్మాజీపేట్‌లో బుధవారం జరిగిన ఈఆర్ ఆర్ ప్రీమియర్ లీగ్ ఫైనల్‌మ్యాచ్‌ను ఆయన తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. గెలుపొందిన హన్మాజీపేట్ జట్టుతో పాటు రన్నరప్‌గా నిలిచిన సంగోజీపేట్ జట్లకు సర్పంచ్ బోనాల సుభాష్‌తో కలిసి కప్‌లు అందజేశారు. నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, యలమంచలి శ్రీనివాస్, ప్రతాప్‌సింగ్, నందుపటేల్, బద్యానాయక్, ఇక్బాల్, రూప్‌సింగ్, మంత్రి గణేష్, మధుసూదన్‌రెడ్డి, రంగరిగారి సంజీవులు, వెంకాగౌడ్, బోనాల సాయిలు, షేక్ అక్బర్, దొడ్ల రవి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి


శ్యాంసుందర్(ఫైల్)

బాన్సువాడ/ బాన్సువాడ రూరల్: పొలం గట్టుపై నుంచి పడి బురదలో కూరుకుపోయిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో నివాసం ఉంటున్న శ్యాంసుందర్‌గౌడ్(41) మద్యానికి అలవాటు పడి ఏ పనిచేసేవాడు కాదు. ఇంటి నుంచి మంగళవారం వెళ్లిన అతను ఇంటికి చేరుకోలేదు. బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువు కింద ఉన్న పొలంలో మలవిసర్జన కోసం గట్టుపై నుంచి పడి కిందపడ్డాడు. మద్యం మత్తులో ఉన్నందున బురదలో కూరుకుపోయి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి భార్య అంబిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు..

గాంధారి: ట్రాక్టర్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న చద్మల్ తండాకు చెందిన బామన్ ఉద్దల్ సింగ్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి..


గురుదాస్ (ఫైల్)

పెద్దకొడప్‌గల్: మద్యం మత్తులో ఓ యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలోని బేగంపూర్ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లంబాడి గురుదాస్(28) పొలం పనులు చేస్తుంటాడు. పొలంలో మంగళవారం మద్యం తాగిన గురుదాస్ అదే మత్తులో పంటకు సంబంధించిన పురుగుల మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబీకులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబాయిలో రాజంపేటవాసి..


జొన్నల రవి(ఫైల్)

రాజంపేట: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన జొన్నల రవి (35) ఉపాధి నిమిత్తం తొమ్మిదేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రెంజల్: మండల కేంద్రం నుంచి వీరన్నగుట్ట గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు తేలడంతో డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

బెల్ట్ షాప్‌పై దాడి

ఖలీల్‌వాడి: నందిపేట్ పీఎస్ పరిధిలోని బాద్గుణలో బద్దం నాగిరెడ్డికి చెందిన బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సీఐలు అంజయ్య, అజయ్ బాబు బుధవారం దాడి చేశారు. రూ. 40 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై..

నందిపేట్: మండలంలోని బాద్గుణ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేయగా వీరి నుంచి రూ.23,340 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ పోలీసులు రెండు రోజుల క్రితం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గాంధీనగర్‌కు చెందిన రాజ్‌కుమార్, టెన్నీలు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నిజామాబాద్‌లో ఒకరికి పది రోజులు..

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్షను జడ్జి సయ్యద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో వినాయకనగర్‌కు చెందిన బాబు మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఖదీర్ 10 రోజుల జైలు శిక్షను విధించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు నిర్వహించిన తనిఖీల్లో 22 కేసులలో వాహనదారులకు రూ. 26,500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

వర్నిలో జోరుగా వ్యభిచారం

- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని పోలీసులు

వర్ని: మండల కేంద్రంలో జోరుగా వ్యభిచారం కొనసాగుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన కాలువ పక్కన ఉండే ఓ మహిళ తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఆమెను హెచ్చరించినా పద్ధతి మార్చుకోవడం లేదంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు నామమాత్రపు తనిఖీలు చేపట్టి వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సదరు మహిళ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తుండడంతో ఆ పరిసర ప్రాంతమంతా అసభ్యంగా తయారైందని ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు వారికి అండగా నిలవడంపైప్రజలుఅనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తండాలో సైతం..

మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఓ తండాలో మరో మహిళ సైతం వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తండావాసులు పేర్కొంటున్నారు. తనిఖీలకు వచ్చిన పోలీసు సిబ్బంది సైతం వారికి అండగా నిలుస్తున్నారు. ఇటీవల వ్యభిచార గృహాలకు వెళ్లిన విటుల నుంచి వారు కుదుర్చుకున్న డబ్బులతో పాటు అదనంగా లాక్కుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై పలుమార్లు ఘర్షణలు జరిగి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా చర్యలు తీసుకోవడంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అసౌకర్యంగా మారిన వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించి నిర్లక్ష్యంగా వహిస్తున్న పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు వస్తే హెచ్చరించాం

మండలంలోని ఓ తండాలో వ్యభిచారం నడుస్తుందనే విషయంపై ఫిర్యాదు రావడంతో సదరు మహిళను హెచ్చరించాం. తండాలో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించాం. ఎక్కడైనా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం వస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ కుమార్, ఎస్సై, వర్ని



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాడ్వాయి: మండలంలోని కన్‌కల్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం బడి ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు.

'డుమ్మా డాక్టర్'పై చర్యలకు వెనకడుగు!

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులకు గైర్హాజరైనా రిజిస్టర్‌లో సంతకాలు ఉండటం, అధికారి విచారణకు వస్తున్నాడని గమనించిన వెంటనే ఆ సంతకాలపైనే సీఎల్(క్యాజువల్ లీవ్)గా మార్చిన ఘటన వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా మెడికల్ ఆఫీసర్‌పై ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈనెల 10, 11 తేదీల్లో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ జోహా విధులకు రాకున్నా ముందే సంతకాలు ఉండటంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌తో 11న విచారణ చేయించారు. విధులకు రాకున్నా సంతకాలు ఉన్నాయని, ఆ సంతకాలపైనే సీఎల్‌గా మార్చారని విచారణలో తేలింది. సదరు వైద్యురాలు విధులకు సక్రమంగా రాకున్నా చాలా కాలంగా అక్కడి సిబ్బందే సంతకాలు చేస్తున్నారని ఆరోపణలు సైతం వచ్చాయి. ఈ ఘటనపై 12న డాక్టర్ జోహాతో పాటు, మరో మెడికల్ ఆఫీసర్ దివ్యకు వివరణ ఇవ్వాలని మోమోలు జారీ చేశారు. ఈ ఘటనలో గ్రీన్ పెన్‌తో నకిలీ సంతకాలు చేయడం, విధులు రాకున్నా సంతకాలు ఉండటంలాంటి అంశాలపై కాకుండా డ్యూటీకి ఎందుకు రాలేదే వివరణ ఇవ్వాలని మోమోలు జారీ చేయడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై డీఎంహెచ్‌వో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వోపై రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అసలు విచారణ ఫైల్ డీఎంహెచ్‌వో దగ్గర లేనట్లు తెలిసింది. నామమాత్రపు వివరణతో విచారణ చేసిన డాక్టర్ చంద్రశేఖర్‌కు సదరు డాక్టర్ బుధవారం మెయిల్ ద్వారా లేఖ పంపినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారులు సైతం గోప్యంగా ఉంచుతున్నారు. వివరాలు, వివరణ ఇవ్వడానికి సంకోచిస్తున్నారు. విధులకు రాకున్నా సంతకాలు చేయడం, నకిలీ సంతకాలను సీఎల్‌గా మార్చాడంతో సదరు వైద్యురాలిపై చర్యలు తీసుకుంటారా లేక ఊరుకుంటారా అని వైద్యశాఖలో చర్చించుకుంటున్నారు. కేవలం రెండు రోజుల వేతనంలో కోతతో సరిపెడతారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పిప్రిరోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అండర్–14 బాల, బాలికల టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఆర్మూర్‌లోని అన్ని పాఠశాలలను ఐదేళ్లలో తీర్చిదిద్దుతానని, పేద బలహీన బడుగు వర్గాల విద్యార్థులు క్రీడలు, విద్యలో ఉన్నత స్థానానికి చేరుకునేటట్లు చేయడమే తన మొదటి ప్రాధాన్యత అని అన్నారు. క్రీడకారులు నిరంతరం శిక్షణ పొంది ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి గౌడ్, ఉపాధ్యక్షుడు పెంట జలంధర్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు, స్కూల్ గేమ్స్ రాష్ట్ర పరిశీలకులు యూనిస్ పాషా, నాగరాజు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం బైక్ దొంగతనాలు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి

ఖలీల్‌వాడి: జల్సాలు, కుటుంబ పోషణ భారమై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని చంద్రనగర్‌కు చెందిన న్యాలకంటి శేఖర్, వినాయకనగర్‌లోని శ్రీనగర్‌కు చెందిన ఆరూర్ సతీశ్‌లు నాలుగు బైక్‌లు దొంగతనం చేసినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్‌లోని చెట్ల పొదలలో బైక్‌లను దాచి బస్టాండ్ వెనుకాల వీటిని విక్రయిస్తుండగా నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. విచారణలో దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ నరహరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన అచ్గాయ్ రోహిత్ మట్కా ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అతని నుంచి రూ. 2300 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏటీఎంను ధ్వంసం చేసిన వ్యక్తి..

ఖలీల్‌వాడి: ఏటీఎం ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి బుధవారం తెలిపారు. నగరంలోని మిర్చి కంపౌండ్‌కు చెందిన పడమటి రమేశ్ గత నెల డిసెంబర్ 18న అర్సపల్లిలో ఉన్న ఏటీఎంను ధ్వంసం చేయగా అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అలాగే ఈ నెల 12న గోశాలరోడ్‌లోని ఏటీఎంను ధ్వంసం చేయగా అలారం మోగడంతో బ్యాంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టౌన్ సీఐ నరహరి, సిబ్బంది ఉన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడవ టౌన్ పరిధిలో బైక్ దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ బుధవారం తెలిపారు. ఈ నెల15న కంఠేశ్వర్‌కు చెందిన తిరుపతి తన బైక్‌ను సుభాష్‌నగర్‌లోని ఓ హోటల్ ఎదుట పార్క్ చేసి వెళ్లగా బయటకు వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణలో హమాల్‌వాడికి చెందిన రాజే రంజిత్‌ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన జ్యోత్స్న తన ఇంటికి తాళం వేసి రాజారాంనగర్‌లో ఉండే అత్తాగారింటికి శుభకార్యం నిమిత్తం వెళ్లింది. గమనించిన దుండగులు రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. దుండగులు రెండు తులాల బంగారం, రూ. రెండున్నర లక్షల నగదు, విలువైన ఎలక్ట్రికల్ వస్తువులను చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు పేర్కొన్నారు.

పెర్కిట్‌లో తాళం వేసిన ఇళ్లల్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న తిరుమల కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోండ్ల ప్రవీణ్‌తో పాటు అదే ఇంటిపై అద్దెకు ఉంటున్న శ్రీకాంత్ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ప్రవీణ్ ఇంట్లో సుమారు 14 తులాల బంగారంతో పాటు రూ. 9వేల నగదు, శ్రీకాంత్ ఇంట్లో ఐదు తులాల వెండిని దుండగులు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.